క్లుప్తంగా

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



వనపర్తిటౌన్: మానవ అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వనపర్తి సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రజని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మానవ అక్రమ రవాణా అంశాలపై లోక్ అదాలత్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణా చట్ట విరుద్ధమని, విద్యార్థులు వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త వారితో జాగ్రత్తగా ఉంటూ.. వారితో ఎక్కువగా గడపకుండా విద్యార్థినులు ఒకరికొకరు తోడుగా ఉండాలన్నారు. విద్యార్థినులకు చట్టాలు, వాటితో చేకూరే లాభాలను వివరించారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డేగల కృష్ణయ్య, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యకు నివాళి



ఖిల్లాఘనపురం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో శుక్రవారం సామాజిక కార్యకర్త కుమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు సామ్య నాయక్, మాజీ సర్పంచు కృష్ణయ్యగౌడ్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య కర్ణాటకలోని ఓ చిన్న గ్రామంలో జన్మించినప్పటికీ దేశం గర్వించదగిన వ్యక్తిగా ఎదిగారని కొనియాడారు. ఓ ఇంజినీయర్‌గా ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచడంతో పాటుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రాజెక్టులను రూపకల్పన చేశారన్నారు.

యూరియా కోసం రైతుల బారులు



పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ముందు యూరియా కోసం శుక్రవారం రైతులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారితో ధృవీకరణ పత్రం ఉంటేనే రైతులకు యూరియా అందజేస్తున్నారు. సింగిల్ విండో కార్యాలయానికి యూరియా వచ్చిందనే విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు ట్రాక్టర్లు, ఆటోలతో కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయానికి మొత్తం 900 బస్తాలు వచ్చిందని, ఒక్కొక్క బస్తా ధర రూ. 270 చొప్పున అందజేస్తున్నట్లు కార్యాలయం సీఈఓ భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, పుష్కలంగానే అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.


పరిసరాల శుభ్రతే ముఖ్యం



పాన్‌గల్: కస్తూర్బా విద్యాలయం ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి పరిసరాలు, స్టోర్ రూమ్, వంట గది, భోజనాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని, అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలని కోరారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చూడాలని ఆయన ఎస్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణధికారి శ్రీనివాసులు, ఏఎస్‌ఓ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: మండలంలోని బునియాది పురం గ్రామానికి చెందిన వీరపాగ ఎల్లయ్య(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి అంత్యక్రియ ఖర్చు నిమిత్తం రూ.5వేలు పంపించారు. బీఆర్‌ఎస్ నాయకులు బాధిత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. కార్యక్రమంలో రాములుయాదవ్, ఉప సర్పంచ్ శివరాజు, గోవింద్, భాగ్యమ్మ, రవి, కుర్మన్న, కురుమూర్తి, గంగన్న, చంద్రయ్య, ఎల్లయ్య, విష్ణు తదితరులు ఉన్నారు.



కౌన్ బనేగా లక్షాధికారి?

- జీసీ బంధు మంజూరుపై గంపెడాశలు
- సాయంపై సవాలక్ష అనుమానాలు
- అర్హుల ఎదురుచూపు



గోప్లాపూర్‌లో క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)



దరఖాస్తు చేసేందుకు మీసేవా ఎదుట గుమికూడిన వివిధ వృత్తిదారులు (ఫైల్)

పాన్‌గల్: కుల వృత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇటీవల దరఖాస్తులను స్వీకరించింది. మండలంలోని 28 పంచాయతీల పరిధిలో 901 దరఖాస్తులు రాగా.. అందులో 494 మంది అర్హులని అధికారులు నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదించారు. దరఖాస్తులు చేసుకున్న అర్హులు రూ.లక్ష సాయానికి వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

అధికార పార్టీ నేతలు సిఫార్స్ చేస్తేనే..

దరఖాస్తు చేసుకున్న అర్హులకు రూ.లక్ష సాయం అందాలంటే ఆయా గ్రామాల్లోని అధికార పార్టీ నేతలు సిఫార్సు తప్పనిసరి అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికే రూ.లక్ష సాయం అందుతుందని, మిగితా వారికి మొండిచేయి అని పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. రూ.లక్ష ఆర్థిక సాయానికి సంబంధించి మండల స్థాయిలో అధికారులపై ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో మన వారు ఉండేలా చూడాలని అధికార పార్టీ నాయకులు కోరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తొలివిడత 15 కులాలకే..

బీసీ వర్గాల్లోని చేతి వృత్తిదారులు వాటికి సంబంధించిన పరికరాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని తొలి విడతలో 15 కులాలకు మాత్రమే అందించనున్నారు. ఇందులో భాగంగా నాయీబ్రాహ్మణులు, రజక, సగర(ఉప్పర), కుమ్మరి (శాలివాహన), అవుసల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, శిల్పులు, కృష్ణ బలిజ, పూసల, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేర సంచార జాతులకు వర్తించే విధంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

నాయీబ్రాహ్మణులకు..



ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయంలో నాయీబ్రాహ్మణులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి గ్రామంలో ఆయా కులానికి ఒక్కరికి సాయం అందించేలా చూడాలి. కుల వృత్తుని నమ్ముకొని గ్రామాల్లో జీవనం సాగిస్తూ ఎన్నో పేద కుటుంబాలు ఉన్నాయి.

– రమేష్, నాయీబ్రాహ్మణుల సంఘం, మండల అధ్యక్షుడు, పాన్‌గల్

అర్హులకు న్యాయం చేయాలి



ప్రభుత్వం కుల వృత్తిదారులకు అందించే రూ.లక్ష సాయం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలి. గ్రామాల్లో అర్హులు కాకపోయిన అధికార పార్టీకి అండగా ఉంటే వారికి సాయం అందిస్తారనే పుకార్లు వినపడుతున్నాయి. అలా కాకుండా అసలైన పేదలకు భరోసా కల్పించాలి.

– దేవేందర్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్

త్వరలోనే చెక్కులు అందజేస్తాం



లబ్ధిదారుల ఎంపిక విషయంలో అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోరాదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశాం. అర్హులకు తప్పక న్యాయం జరుగుతుంది. మండలంలో మొదటి విడతలో 39 మందిని ఎంపిక చేశాం, వారికి త్వరలోనే చెక్కులు అందజేస్తాం.

– నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ, పాన్‌గల్

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



కేతేపల్లిలో నిల్వ నీటిలో అబేట్ ద్రావణం కలుపుతున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ డా శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లి, మాందాపూర్ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, క్షయ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు.

మందులు వాడితే రోగం నయం

టీబీ వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే రోగం నయం అవుతుందన్నారు. 2 వారాలకు మించి దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తెమడ పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని సూచించారు. వ్యాధి సోకిన వారు బయట తిరగకూడదని, ఉమ్మరాదన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, సతీష్, బుడ్డమ్మ, నిర్మల, ఆశాలు పాల్గొన్నారు.

సాయుధ పోరాటంతోనే తెలంగాణకు విముక్తి



అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: సాయుధ పోరాటంతోనే నిజాం, ఖాసీం రజ్వీ కబంధ హస్తాల నుంచి తెలంగాణకు విముక్తి లభించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి సాయుధ పోరాట యోధులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మోయినుద్దీన్, దొడ్డి కొమరయ్య, సోయబుల్లాఖాన్ చిత్రపటాలకు, వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం పేదల విముక్తి కోసం వారు త్యాగాలు చేశారన్నారు. ఆ యోధుల స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఎందరో యోధులు పోరాడితేనే భారతదేశం బ్రిటిష్ వారి నుంచి విముక్తి లభించిందన్నారు. ఈనెల 16వ తేదీన జిల్లా కేంద్రంలో, 17వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలస్వామి, చిన్ననారాయణ, హన్మంతు, పెంటయ్య పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థులకు సన్మానం



నర్మదను సన్మానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన విప్పటూరు విక్రంరెడ్డి కుమార్తె సుదీప్తి వనపర్తి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి విద్యార్థిని సన్మానించారు. విద్యార్థిని శుక్రవారం తండ్రితో కలిసి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువుకు పేద, ధనిక వ్యత్యాసం ఉండదన్నారు. ప్రతి విద్యార్థి నిబద్ధతతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన దేవని మన్యం కుమార్తె నర్మద ఎంబీబీఎస్ సీటు సాధించడంతో మంత్రి నిరంజన్‌రెడ్డి విద్యార్థిని శాలువాతో సత్కరించారు. అదేవిధంగా నర్మదకు రూ.10వేలు అందజేసి ప్రోత్సహించారు. రానున్న రోజుల్లో నర్మద ఉన్నత చదువులకు అయ్యే ఖర్చులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వినీలారాణి, ఉప సర్పంచ్ శివసాగర్, ఎంపీపీ గాయత్రి తదితరులు ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



అమరచింత: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రాజకీయాలను పక్కన పెట్టి అందరి సహకారంతో అభివృద్ధికి కలిసిరావాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని పాంరెడ్డిపల్లె, నాగల్‌కడ్మూర్, సింగంపేట, చంద్రగఢ్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని ఏడో వార్డులో రూ.కోటితో చేపడుతున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మంగమ్మతో కలిసి బీసీ కాలనీలో రూ.కోటితో చెపట్టే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో గ్రామాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తున్నారని వెల్లడించారు. పాంరెడ్డిపల్లెలో కేజీబీవీలకు వెళ్తున్న రహదారి కోసం రూ.5లక్షలు, వాల్మీకి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు, నాగల్‌కడ్మూర్‌లో రూ.5 లక్షలతో సీసీ రహదారి, సింగంపేటలో రూ.5 లక్షలతో సీసీ రహదారి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చంద్రగఢ్‌లో బస్‌స్టాప్ కోసం రూ.5 లక్షలు మంజూరు చేశామన్నారు. అమరచింతలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజ, జెడ్పీటీసీ మార్క సరోజ, రాజేశ్వరమ్మ, విజయలక్ష్మి, బాల్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ బంధు చెక్కుల పంపిణీ

ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మైనార్టీ బంధు ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కులను ఏడుగురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

‘ఎస్టీ’జాబితాలో చేర్చే వరకు ఉద్యమిద్దాం



భీమన్ననాయుడిని సన్మానిస్తున్న వాల్మీకులు

కొత్తకోట రూరల్: ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వాల్మీకులను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి వారి సంక్షేమం కోసం కృషి చేయాలని వాల్మీకి బోయ ఐక్యకార్యచరణ కమిటీ రాష్ట్ర సభ్యుడు భీమన్న నాయుడు కోరారు. శుక్రవారం మండలంలోని పాలెంలో వాల్మీకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా భీమన్న నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని వాల్మీకులందరూ ఐక్యంగా ఉండి పోరాడితేనే ఎస్టీ హోదా సాధ్యమవుతుందని, ఎస్టీ సాధన కోసం వాల్మీకి మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు వాల్మీకులను గుర్తించి ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ వాల్మీకులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులునాయుడు, సహదేవుడు, సత్యనారాయణ, రవి, కురుమూర్తి, తిరుపతయ్య, జయమ్మ, నాగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘పాలమూరు’ ప్రాజెక్టుతో సస్యశ్యామలం



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్: కొల్లాపూర్ పట్టణంలో శనివారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి జనం తరలివచ్చే విధంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు 91 ఆర్టీసీ బస్సులను కేటాయించారని, గ్రామ జనాభా ఆధారంగా బస్సులను కేటాయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సీఎం ప్రారంభిస్తున్న సందర్భంగా వారికి కేటాయించిన బస్సుల్లో మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో వెళ్లే విధంగా వారిని చైతన్యం చేయాలని కోరారు. గ్రామాల నుంచి వచ్చే బస్సులకు తెల్లరాళ్లపల్లితండా వద్ద పికెట్ ఉంటుందని, అక్కడ భోజనాలు, వాటర్ బాటిల్ అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. సిబ్బందికి కేటాయించిన విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో చంద్రశేఖర్‌నాయక్, జ్యోతినందన్‌రెడ్డి, బాలరాజు, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతయ్యనాయుడు, శ్రీనివాస్‌నాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతురెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవని మన్యం, కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి మంత్రి నిరంజన్‌రెడ్డి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, పృథ్వీరాజ్, సర్పంచ్ వినీలారాణి, కుర్మయ్య, ఉప సర్పంచ్ చీర్ల శివసాగర్, మహేష్‌గౌడ్, సయ్యద్, గణేష్ ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న రవీందర్

వనపర్తి టౌన్: నియోజకవర్గంలో బీజేపీ గెలుపే తన లక్ష్యంగా పని చేస్తానని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీందర్ అన్నారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రవీందర్‌ను నియమించడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. కొన్ని ఏళ్ల నుంచి బీజేపీలో శక్తి వంచన లేకుండా పనిచేశానని, కమ్యూనిస్టులకు అడ్డగా ఉన్న వనపర్తిలో రెండు సార్లు పట్టణ అధ్యక్షుడిగా, బార్ కౌన్సిల్ చైర్మన్‌గా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. తన ఇంటిపై, వ్యాపార సముదాయాలపై ఎన్ని దాడులు చేసిన బీజేపీ వీడలేదని చెప్పారు. న్యాయవాదిగా పట్టణ ప్రజలకు ఎన్నో సేవలను ఉచితంగా అందిచానని, తన సేవలను పార్టీ గుర్తించి క్రియాశీలమైన బాధ్యతలు సైతం అప్పగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, నాయకులు నారాయణ, రామన్‌గౌడ్, పెద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్, బాబురావు, బచ్చురాము, దేవేందర్, కదిరే మధు, వెంకటేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

పాన్‌గల్: సమ్మె సమయంలో పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల నాయకులు సుబ్బయ్య, పెంటయ్య మాట్లాడుతూ సమ్మె సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని వాపోయారు. ప్రభుత్వం జీఓలను విడుదల చేయాలని కోరారు. లేకపోతే ఈనెల 16వ తేదీ నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో సురేష్, రాజు, మహేష్, భీష్మ, నాగమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: చాలిచాలనీ వేతనాలతో ఏళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కృష్ణయ్యకు అందజేశారు. కార్యక్రమంలో బొజ్జన్న, కరీం, వెంకటేష్, గోపాల్, తిరుపతి, రాములు పాల్గొన్నారు.



కొత్తకోటలో ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

ఖిల్లాఘనపురం: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, పుష్ప, శేఖర్, భిక్షపతి, దాసు, కోళ్య, నర్సింహులు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

కొత్తకోట రూరల్: విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందిన ఘటన కొత్తకోట మండలం కానాయపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కానాయపల్లికి చెందిన శివయ్య భార్య యాటగిరి పల్లవి (30) వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా, విద్యుత్‌వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

విజయభేరి సభను విజయవంతం చేద్దాం

పెబ్బేరు రూరల్: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయభేరి సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దుల విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో కాంగ్రెస్ అగ్రనాయకత్వం రాష్ట్రానికి విచ్చేస్తున్న సందర్భంగా సోనియాగాంధీ అధ్యక్షతన ఐదు గ్యారంటీ హామీలను ఇవ్వనున్నారని, విజయభేరి సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రె స్ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.

ఐదో రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ వర్కర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం చెల్లించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరింది. పెబ్బేరు సీడీపీఓ ఆఫీస్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాధ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు తొలగించి అంగన్‌వాడీ వర్కర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, చాలిచాలనీ వేతనాలతో పనిచేస్తున్నా తమ గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘాలను చర్చలకు పిలవకపోవడం అప్రజాస్వామికమన్నారు. అంగన్‌వాడీలతో సంబంధింత అధికారులు, మంత్రి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాంతాబాయి, సుగుణబాయి, శారద, భారతి, లక్ష్మి, గోవిందమ్మ, వెంకటేశ్వరమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

మదనాపురం: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీ నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో రెండు రోజులుగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారని, నిందితులపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మదనాపురం పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద ఉన్నారు.

ముమ్మరంగా సాయిచంద్ చారిటబుల్ సేవలు

- రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్‌పర్సన్ రజని

ఆత్మకూర్: ఉద్యమ గాయకుడు సాయిచంద్ పేరిట చారిటబుల్ ట్రస్టు ద్వారా ముమ్మరంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్‌పర్సన్ రజని సాయిచంద్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు ఖానపూర్‌లో) కౌన్సిలర్ చెన్నయ్య విన్నపం మేరకు సందర్శించారు. చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్‌తో కలిసి శాఖ గ్రంథాలయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని పాత పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుందని, అక్కడే కొత్తభవనం నిర్మించి గ్రంథాలయం ఏర్పాటుకు అనువైన స్థలంగా గుర్తించారు. రూ.15 లక్షల నిధులతో గ్రంథాలయం ఏర్పాటుకు రజనిసాయిచంద్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో జీకే రాములు, చంద్రన్నగౌడ్, కుర్వ రవి, మోహన్, రవీందర్ రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మల్లేష్, రాజు, గోపాల్ తదితరులు ఉన్నారు.

